## పోటీ పరీక్షల్లో రాణించాలంటే ప్రత్యేక నైపుణ్యం అవసరం

సాక్షి, సిటీబ్యూరో: ఇతర అన్ని పరీక్షల్లో రాణించే విద్యార్థులు కూడా పోటీ పరీక్షల్లో వెనుక బడుతుంటారని, దానికి ప్రత్యేక నైపుణ్యం, శిక్షణ అవసరమని పోటీ పరీక్షల ప్రముఖ శిక్షణా సంస్థ ఫిట్జీ (ఎఫ్‌ఐఐటీజేఇఇ) గ్రూప్ డైరెక్టర్ ఆర్ఎల్ త్రిఖా అభిప్రాయపడ్డారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జెఇఇ) మెయిన్ సెషన్-1 ఫలితాల్లో ఫిట్జీ విద్యార్థుల్లో 8 మంది 100 స్కోర్‌తో అత్యుత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఏకాగ్రత, అంకితభావంతోనే మంచి ఫలితాలు లభించాయని అభినందించారు. ఇదే స్ఫూర్తితో జెఇఇ అడ్వాన్స్‌డ్‌లోనూ మంచి ర్యాంకులు సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని అన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు నిధులివ్వండి



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీత యాదవ్ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు ఫోన్ చేసి నిధుల మంజూరు చేసేలా చూడాలని ఆదేశించినట్లు కార్పొరేటర్ తెలిపారు. నాయకులు మేకల రాముయాదవ్ ఉన్నారు.

# అభివృద్ధికి పూర్తి సహకారం



హెచ్‌బీకాలనీలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

కుషాయిగూడ: డివిజన్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందజేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌లో సుమారు రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన అభివృద్ధి పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసి అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, డీఈ స్వరూప, వాటర్‌వర్క్స్ డీజీఎం సతీష్, ఏఈ స్రవంతి, వేణుగోపాల్, స్థానిక నేతలు సుఖేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, కృష్ణమూర్తి, మల్లేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, రంగు ప్రసాద్ పాల్గొన్నారు.

**పాస్టర్లకు అండగా ఉంటా..**

పాస్టర్లకు అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఎన్‌టీఆర్‌నగర్, బండబావి కమ్యూనిటీహాల్‌లో జరిగిన పాస్టర్స్ ప్రేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీపీడబ్ల్యూఏ) 5వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నీటికి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టండి

ఉప్పల్: నియోజకవర్గంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని కలిసి వివరించారు. నియోజకవర్గంలో మురుగు నీటి సమస్యతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య తీవ్రంగానే ఉందని గుర్తుచేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటిపైప్ లేని ప్రాంతాలకు విధిగా ట్యాంకర్‌లను పంపించి ప్రజల దహార్తిని తీర్చాలని కోరారు. ప్రతి డివిజన్‌కు రూ.కోటి



మంజూరు చేసి పక్కా ప్రణాళిక బద్ధమైన డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి పర్చాలని కోరారు. ఎండీ సుదర్శన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గౌతంనగర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

గౌతంనగర్: గౌతంనగర్ కాలనీలో మౌలిక సదుపాయలు కల్పించాలని కోరుతూ మంగళవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి కాలనీ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కిరణ్‌పట్నాయక్, నరసింహారావు వినతి పత్రం అందజేశారు. గౌతంనగర్ కాలనీలో తాగునీరు, స్పీడ్ బ్రేకర్స్, విద్యుత్ స్తంబాలు, స్పోర్ట్స్ మెటీరియల్స్, ట్రాఫిక్, పారిశుద్ధ్య, బస్ సౌకర్యం, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపేందుకు హామీ ఇచ్చారు. కాలనీ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు వసంత్‌కుమార్ ఉన్నారు.

## గొర్రె కాపర్ల కార్పొరేషన్ చైర్మన్ పదవి కురుమలకు ఇవ్వాలి



మల్లాపూర్: గొర్రె కాపర్ల కార్పొరేషన్ చైర్మన్‌ను కురుమలకు ఇవ్వాలని మంగళవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కాంగ్రెస్ పార్టీ కాప్రా సర్కిల్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చౌదరి పర్వతాలు కోరారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన కురుమ సంఘం ప్రతినిధులతో కలిసి పర్వతాలు బయోడేటాను అందజేశారు. గొరిగే మల్లేశం కురుమ, రేగు కృష్ణయ్య కురుమ, బెల్లం గట్టయ్య కురుమ తదితరులు ఉన్నారు.

# సమష్టిగా బీజేపీ అభ్యర్థిని గెలిపించుకుందాం..



అల్వాల్: సమష్టిగా కష్టపడి పనిచేసి బీజేపీ అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బీజేపీ అల్వాల్ సర్కిల్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. అల్వాల్ సర్కిల్ పంజాబీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ప్రజలు మరోసారి మోసపోయి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేయవద్దని, కార్యకర్తలు అందరూ ఏకతాటిపై ఉండి అభ్యర్థిని గెలిపించుకోవాలని ముకుమ్మడిగా అభిప్రాయ పడ్డారు. నాయకుల మద్య బేధాలు లేకుండా చూసుకోవాలని, ఒక కోర్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, దానికి కావాల్సిన నాయకుల పేర్లు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి నియోజకవర్గం నాయకులు మల్లికార్జున గౌడ్, శేఖర్, డివిజన్ల అధ్యక్షులు రవికిరణ్, అజయ్, సీనియర్ నాయకులు దండుగుల వెంకటేష్, నిమ్మ కృష్ణారెడ్డి, బన్సీలాల్ లక్ష్మణ్, వినయ్, శంకర్, గోపి, మాణిక్యరెడ్డి, అజిత్‌సాయి, ఆనంద్, మహేందర్‌రెడ్డి, రామ్మోహన్, మల్లికార్జున యాదవ్, రామ్‌సింగ్, రాజు, నాగరాజు, మహిళా నాయకురాలు ప్రతిభ, సుజాత, కరుణశ్రీ, పద్మిని, అరుణ, అనురాధ పాల్గొన్నారు.

## పూడికతీత పనుల్లో వేగం పెంచాలి



నాలా పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం పెద్ద నాలాలో పూడికతీత పనుల్లో వేగం పెంచాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. మంగళవారం నాలా పూడికతీత పనులను కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా నాలా వెంబడి మొత్తం ఐదు వంతెనలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. మరో రెండు బ్రిడ్జి పనులు పూర్తయితే నాలాలో చెత్తాచెదారం ఉండదన్నారు. కార్యక్రమంలో డీఈ రూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## రేపు షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని (రైల్వే ట్రాక్ సమీపంలో) ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయం 28వ వార్షిక బ్రహ్మోత్సవం ఈ నెల 29వ తేదీన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 5.30 హారతి, 6.30కు విశేష అభిషేకం, 9 గంటలకు సాయిసత్య వ్రతం, మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 7 గంటలకు పల్లకీ సేవ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ

- 20 తులాల ఆభరణాలు మాయం
- మరో మూడిళ్లలో చోరీకి విఫలయత్నం

కుషాయిగూడ: తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లోకి చొరబడ్డ దుండగుడు బంగారు ఆభరణాలను అపహరించడంతో పాటు మరో మూడిళ్లలో చోరీకి విఫలయత్నం చేశాడు. ఈ ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. నార్త్ కమలానగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం ఈ నెల 25న కుటుంబ సభ్యులతో కలిసి కాశీ యాత్రకు వెళ్లారు. అదే పోర్షన్‌లో ఉండే సుబ్రహ్మణ్యం సోదరుడు హరినారాయణ మంగళవారం ఉదయం పాలప్యాకేట్ల కోసం వెళ్తుండగా ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించాడు. లోనికి వెళ్లి చూడగా ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా డోర్‌లు ఓపెన్ చేసి కనిపించాయి. దీంతో విషయాన్ని సోదరుడి దృష్టికి తీసుకెళ్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు తెలుసుకున్నారు. బాధితుడితో ఫోన్‌లో మాట్లాడారు. బీరువాలో 17-20 తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు వారు తెలిపారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు ఆధారాలు సేకరించాయి. ఘటన స్థలాన్ని కుషాయి



వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ పద్మజా, ఏసీపీ నరేష్‌రెడ్డి, డీఐ సాయిప్రకాశ్‌గౌడ్

గూడ మల్కాజిగిరి డీసీపీ పద్మజా, ఏసీపీ పింగిళి నరేష్‌రెడ్డి, డీఐ సాయిప్రకాశ్‌గౌడ్ సందర్శించి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి సోదరుడు హరినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే ఈ క్రమంలో భవానీనగర్ కాలనీలో తాళం వేసి ఉన్న మూడు ఇళ్ల తాళాలు కూడా పగులగొట్టిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. దర్యాప్తులో భాగంగా నార్త్ కమలానగర్‌లో చోరీకి పాల్పడ్డ దుండగుడే భవానీనగర్‌లో ఇళ్ల తాళాలు పగులగొట్టినట్లు పోలీసులు గుర్తించారు. భవానీనగర్‌లోని ఓ సెక్యూరిటీ కార్యాలయంతో పాటు మరో రెండిళ్ల తాళాలు పగులగొట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఒక్కడే ఈ దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు డీఐ సాయిప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

## పవర్ బోర్‌వెల్ పనులు ప్రారంభం

మౌలాలి: డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ గ్రౌండ్‌లో పార్క్‌లో మంగళవారం మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ పవర్ బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్క్ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తునాన్నరు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి సమస్యపై అధికారులతో సమీక్ష

బోడుప్పల్: జలమండలి అధికారులతో మంగళవారం బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి, కమిషనర్ రామలింగం సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్యపై చర్చించి, రానున్న వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ తాగునీటి సమస్యను నిత్యం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. రిపేర్లు వస్తే వెంటనే మరమ్మతులు చేపడతామన్నారు. వాటర్ మెన్‌లు సకాలంలో తాగునీటిని సరఫరా చేసి కాలనీల ప్రజలకు



సమీక్షలో మేయర్, కమిషనర్

ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే స్పందించి వాటికి పరిష్కారం చూపాలన్నారు. డీజీఎం నిర్మల, మేనేజర్ మమత, కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్ పాల్గొన్నారు.

# చాలీచాలని జీతాలతో అవస్థలు

- పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌మాదిగ



హబ్సిగూడ: హబ్సిగూడలోని సుప్రభాత్ హోటల్‌లో యువసేన రాష్ట్ర అధ్యక్షులు పొట్టపెంజర రమేష్‌మాదిగ అధ్యక్షతన రాష్ట్రంలోని పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ హాజరై మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నుంచి దళితులు దేశంలోని గ్రామాలన్నింటినీ పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను తీసుకున్నారు. పలు కులాలన్నీ దళితులకు పారిశుద్ధ్య పనిని బలవంతంగా అంటగట్టారన్నారు. పారిశుద్ధ్య కార్మికులు చాలీచాలని జీతాలతో రోజంతా గ్రామాలను శుభ్రంగా ఉంచుతున్నారని, ఇప్పటికీ పలు గ్రామాల్లో మలమూత్రాలను చేతులతో ఎత్తివేస్తూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. స్వచ్ఛ భారత్‌కు అసలు రూపమైన పారిశుద్ధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 13న పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, చెప్పు డప్పు వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలని చలో హైదరాబాద్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చింత స్వామి, పాలడుగు శ్రీనివాస్, మహిళ వ్యవస్థాపక అధ్యక్షురాలు మేరి, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు చిలకమర్రి గణేష్, బండారి శ్రీను, చాపకృష్ణ, నంగునూరి వేణు, శివరాజ్, వరలక్ష్మీ, చిన్న స్వామి, సారంగం, రాజేష్‌ఖన్నా, నరేష్, శ్రీను, బద్రన్న, పరుశురాం, రాజేందర్, యాకయ్య, యల్లేష్, మధురాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అల్వాల్ ఉపకమిషనర్‌కు వినతి

అల్వాల్: కాలనీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అల్వాల్ ఉపకమిషనర్‌ను సాయిరెడ్డినగర్ కమిటీ నాయకులు కోరారు. నూతనంగా ఏర్పాటు చేసుకున్న కమిటీ నాయకులు మంగళవారం అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ఘనంగా సత్కరించారు. తమ కాలనీలో నెలకొన్న పలు సమస్యలపై ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక వసతులు కల్పించాలని ఆయనను అభ్యర్థించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దిలీప్, సీనియర్ కాలనీ వాసులు సహదేవుడు,



అల్వాల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

విజయ్ ప్రతాపరెడ్డి, జోగిరాజ తదితరులు ఉన్నారు.

# శ్రీకృష్ణ ఆలయంలో తిరుకల్యాణోత్సవం



తిరువీధి సేవలో స్వామి వారు

బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయం పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరుకల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆలయ చైర్మన్ పన్నాల కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 7గంటలకు సేవాకాలం, తీర్థ ప్రసాద గోష్ఠి, ద్వారతోరణ పూజ, చతుస్థానార్చన, అగ్నిముఖం, నిత్య పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఉదయం 10గంటలకు తిరుకల్యాణోత్సవం, నిత్యబలి, నివేదన, అన్నదానం, సాయంత్రం 5.30 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, తిరువీధి సేవ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల సద్గుణాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

# సన్‌రైజ్ కిడ్స్ ప్లే స్కూల్ ప్రారంభం

బోడుప్పల్: చెంగిచర్ల ఎంఎల్ఆర్ కాలనీలో మంగళవారం సన్‌రైజ్ కిడ్స్ ప్లే స్కూల్‌ను 3వ డివిజన్ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న చిన్న పిల్లలకు అందుబాటులో ఉందని, 8 నెలల నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలు ఈ ప్లే స్కూల్‌లో చేరవచ్చన్నారు. చిన్నతనం నుంచి విద్యాబుద్ధులు నేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని సూచించారు. నర్సరీ, జూనియర్ కేజీ, సీనియర్ కేజీ అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కాంగ్రెస్ నాయకులు కొత్త గోపాల్‌గౌడ్, పాఠశాల నిర్వాహకురాలు అన్నపూర్ణ, కాలనీవాసులు వి.సుధాకర్, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.



ప్లే స్కూల్ ప్రారంభోత్సవంలో కొత్త చందర్‌గౌడ్

# మమత ఓల్డ్ ఏజ్ హోమ్‌కు టీవీ అందజేత

హబ్సిగూడ: వెంకట్‌రెడ్డినగర్ ఫెవికాల్ ఛాంపినెస్ క్లబ్ అధ్యక్షుడు చెల్లోజు ఎల్లాచారి ఆధ్వర్యంలో రామ్‌శంకర్‌నగర్‌లోని మమత ఓల్డ్ ఏజ్ హోమ్‌కు కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్ చేతులమీదుగా



టీవీ అందచేసి అనంతరం వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫెవికాల్ కంపెనీ ఉత్పత్తులు వాడే కార్పెంటర్ సోదరుల ద్వారా సమాజ సేవ చేయాలని ఉద్దేశ్యంతో వారికి ఆర్థిక సహాయం అందించి ఇలాంటి సేవా కార్యక్రమాలు కార్పెంటర్ సోదరులతో చేయించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఫెవికాల్ కంపెనీ రీజనల్ మేనేజర్ అజయ్‌ఠాకూర్, ఇన్‌చార్జి ఫిరోజ్ అర్జున్, ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకురాలు భారతికమలాకర్, క్లబ్ సభ్యులు మారేపు రవి, పోలాస కనకాచారి, విశ్వనాథుల రామకృష్ణ, నర్సింహాచారి, ధనుంజయ్, కట్కమోజు సతీష్, వేమనూరి వేణుచారి, బాలు, లింగం తదితరులు పాల్గొన్నారు.

## 2న షిరిడీ సాయిబాబా వార్షికోత్సవ వేడుకలు



అల్వాల్: ఓల్డ్ అల్వాల్ జొన్నబండ బృందావన్ కాలనీలో వచ్చే నెల 2వ తేదీన సాయిబాబా ఆలయంలో షిరిడీ సాయినాథుడి 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం 7:30 గంటలకు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం స్వామివారి పల్లకీ సేవ ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ధైర్యంగా పరీక్షలకు హాజరు కావాలి

రామంతాపూర్: తెలంగాణ రాష్ట్ర రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లింగారెడ్డి గార్డెన్‌లో మంగళవారం వివిధ పాఠశాలలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలకు ఏ విధంగా హాజరు కావాలి అనే విషయంపై జరిగిన అవగాహన సదస్సుకు ప్రముఖ మోటివేటర్ సు.దీర్ చంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆందోళన, భయం వదిలి ఆత్మవిశ్వాసంతో ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరు కావాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి తర్వాత ఏ విధంగా ఎంచుకోవాలో అని విద్యార్థులకు వివరించారు. అసోసియేషన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రామ్‌నర్సయ్య, నాగ మోహన్‌రెడ్డి, వెంకన్నగౌడ్, సోమశేఖర్‌గౌడ్, పర్యాద రాజు, ఉపేందర్, కబీర్, సోహైల్, శర్మ, సంజీవరెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిమ్‌లో పరికరాలను సమకూర్చాలి



స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్‌తో జిమ్ గురించి చర్చిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: నాగలక్ష్మీనగర్ కాలనీలోని జిమ్ సెంటర్‌లో కావాల్సిన జిమ్ పరికరాలను సమకూర్చాలని జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డిని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం నాగలక్ష్మీనగర్ కాలనీలోని జీహెచ్ఎంసీ జిమ్‌ను కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం జిమ్ సెంటర్‌లో మరమ్మతులు, సామాగ్రి గురించి చర్చించారు. ఓల్డ్‌మల్లాపూర్, నెహ్రూనగర్ బ్లాక్-2, వెంకటరమణ కాలనీ, జనప్రియ టౌన్‌షిప్, మే ఫ్లవర్ పార్క్, దత్తాత్రేయనగర్ కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో మాజీ వార్డు కమిటీ సభ్యులు, పీఆర్.ప్రవీణ్, రఘు, నాగరాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన సేవలందించాలి



దుకాణాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించినప్పుడే గుర్తింపు వస్తుందని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మంగళవారం ఆర్‌కేనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మహేష్ ఫ్లవర్స్ షాపును ఆయన ప్రారంభించారు. మల్కాజిగిరి ప్రజల కోసం షాపు ఏర్పాటు చేశామని అన్ని రకాల పూలు, దండలు ఇక్కడ లభ్యమవుతాయని షాపు యజమాని మహేష్ తెలిపారు. దుకాణ ప్రారంభోత్సవంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ఎస్ఐ రమేష్‌తో పాటు సునీల్ యాదవ్, ఉమేష్‌సింగ్ పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న కళా సిల్క్ ఎగ్జిబిషన్



కాప్రా: ఏఎస్‌రావునగర్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ ఎగ్జిబిషన్ మహిళలను ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్ ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత హస్త కళా వస్త్రాలు సుమారు 70కిపైగా స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వికాస్ జైన్ మాట్లాడుతూ.. ఈ ఎగ్జిబిషన్ ద్వారా వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత హస్తకళాకారులు స్వయంగా తయారు చేసిన చేనేత వస్త్రాలతో పాటు పోచంపల్లి, ఇక్కత్, బాల్చురి, జాంధాన్ని, బెంగాళి కాటన్, ఉప్పాడ, ధర్మవరం, వెంకటగిరి సిల్క్ శారీస్, జైపూర్ కాటన్ వస్త్రాలు ఈ ప్రదర్శనలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు జ్యూట్ బ్యాగ్స్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యూయలరీ కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ స్టాల్స్ ప్రతిరోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. వినియోగదారులకు సరసమైన ధరల్లోనే లభిస్తున్నట్లు చెప్పారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అల్వాల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌కు చెందిన చింతలపాటి కృష్ణంరాజు(50) ఈ నెల 25వ తేదీన తన ద్విచక్రవాహనంపై సుచిత్ర నుంచి అల్వాల్ వైపు వస్తుండగా ఎదురుగా వచ్చి ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

మేడ్చల్: పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వాటిని మున్సిపల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు దాడులు చేసి అక్రమ భవనాలను గుర్తించి వాటిని కూల్చివేశారు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.